క్లుప్తంగా

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మం మయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఖమ్మం బైపాస్ రోడ్డులో జరిగే 'వాడ వాడకు పువ్వాడ' కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకోనున్నారు. అలాగే, అక్కడి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం 3.30 గంటలకు శ్రీనివాస నగర్‌లో వాడవాడ పువ్వాడ కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి పువ్వాడ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి చెక్కులు పంపిణీ చేయనున్నారు.

ప్రమాదవశాత్తు చెరకు తోట దగ్ధం

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ప్రమాదవశాత్తు చెరకు తోట దగ్ధమైంది. గ్రామంలోని చెరకు తోట పైనుంచి వెళ్లిన విద్యుత్ తీగలు రాసుకుని నిప్పు రవ్వలు పడడంతో మంటలు అంటుకున్నాయి. దీంతో రైతులు కుమ్మరి వెంకటేశ్వర్లు, భద్రయ్య, ఆనందరావు, జనార్దన్‌కు చెందిన దాదాపు ఏడు ఎకరాల పంట కాలిపోయింది. అయితే, నేలకొండపల్లిలో ఫైరింజన్ లేకపోవటంతో కూసుమంచి ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చినా... రాత్రి కావడంతో రాలేదు. దీంతో రైతులు, కూలీలు మంటలు ఆర్పేందుకు అవస్థ పడాల్సి వచ్చింది.

కలెక్టరేట్ ఏఓ బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఏఓగా కారుమంచి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీఓ కార్యాలయం ఏఓగా ఉన్న ఆయనను ఇటీవల బదిలీ చేయగా విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఏఓగా విధులు నిర్వర్తించిన మదన్‌గోపాల్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌గా వెళ్లారు.

చర్చిలో ప్రార్థనలు

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడ నగర్‌లో షాలేము ప్రధాన చర్చి మందిరంలో సర్పంచ్ కంపాటి లలిత రవి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 డైరీని నాయకుడు రవికిరణ్ ఆవిష్కరించారు. ఉపసర్పంచ్ షేక్ హసీనాతో పాటు కాంపాటి రవి, అజ్మీరా వీరు నాయక్, లాజర్ పాల్గొన్నారు.

గాయకుడికి సన్మానం

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లికి చెందిన గాయకుడు పెద్దపాక విజయ్‌కుమార్‌ను ఖమ్మంలో జరిగిన గౌడ జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వృత్తుల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చూసి పాట రాసినట్లు తెలిపారు.

బెల్లంవేణుపై చర్య తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: దేవదాయ శాఖ ఉద్యోగి రెంటాల సమతను మానసిక వేధింపులకు గురిచేసి ఆత్మహత్య ప్రయత్నానికి కారకుడైన బీఆర్ఎస్ నాయకుడు బెల్లం వేణు పై చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి గ్రీవెన్స్‌లో వినతిపత్రం ఇచ్చారు. నాయకులు గుంతేటి వీరభద్రం, వెంకటరమణ, రహమాన్, భద్రూనాయక్, పద్మాచారి, సంజీవరావు, సోమరాజు, శ్రీనివాస్, ఉపేంద్ర నాయక్, రమ్య, సతీష్, వీరన్న పాల్గొన్నారు.

అడవిలో అగ్గి

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపుడి సమీపాన అడవిలో అగ్గిరగులుకుంది. గ్రామ సమీపంలోని కుక్కల గుట్టపై సోమవారం రాత్రి మంటలు ఎగిసిపడుతుండగా స్థానికులు గుర్తించారు. వందలాది ఎకరాల్లో ఉన్న గుట్టపై ఆకురాలి ఎండిపోయివడంతో మంటలు అంటుకుని ఉంటాయని తెలుస్తోంది.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన అధికారి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో జరుగుతున్న పీజీ పరీక్షలను యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈనెల 10వ తేదీన పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కాగా పరిశీలించిన ఆయన నిర్వహణ తీరును సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, కళాశాలలో జరుగుతున్న డిగ్రీ స్పాట్ వాల్యుయేషన్‌ను కూడా పరిశీలించారు. యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు, అసోసియేట్ ప్రొఫెసర్ రావులపాటి సీతారామారావు, ప్రిన్సిపాల్ కాట్ల రాజేందర్ కాట్ల, అధ్యాపకుడు అయిలయ్య పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం తరలింది!

నేలకొండపల్లి ఫైర్‌స్టేషన్ ఖమ్మం మార్కెట్‌కు కేటాయింపు

- అధికారుల తీరుపై మండిపడుతున్న చెరుకు రైతులు
- మళ్లీ ఉద్యమించక తప్పదని స్థానికుల ఆగ్రహం



ఫైరింజన్ తరలించడంతో బోసిపోతున్న షెడ్



నేలకొండపల్లిలోని అగ్నిమాపక శాఖ కేంద్రం

నేలకొండపల్లి: అనేక ఏళ్లు అగ్నిమాపక కేంద్రం కోసం పోరాటాలు సాగించారు. ఎట్టకేలకు 2015లో నేలకొండపల్లి మండల కేంద్రంగా ఉన్న ఫైర్‌స్టేషన్ ఏర్పాటైంది. కానీ ఇప్పుడు ఆ కేంద్రాన్ని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తరలించారు. దీంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనేక ప్రమాదాలు..

నేలకొండపల్లి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం లేక గతంలో అనేక ప్రమాదాలు సంభవించి ఆస్తి నష్టం జరిగింది. ఈ నేపథ్యాన అఖిలపక్షంలో పోరాటాలు సాగించగా ఎట్టకేలకు 2015లో అప్పటి మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి చొరవతో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటైంది. అప్పట్లో భవనాలు లేకపోవటంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న భవనాన్ని ఖాళీ చేయించి అగ్నిమాపక కేంద్రాన్ని అప్పగించారు. తద్వారా నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో అగ్నిప్రమాదం జరిగితే సత్వరమే సేవలందించడం వీలయ్యేది. నేలకొండపల్లి మండలంలోని చెరకు తోటలతో పాటు ముదిగొండ మండలం పారిశ్రామిక ప్రాంతం కావడంతో అగ్నిప్రమాదాలు నిత్యకృత్యమయ్యేవి. ఏటా దాదాపు 50కు పైగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈనెల 8న కూడా మంగ్రాజుపల్లి సమీపంలో రైతు శ్రీనివాసరావుకు చెందిన ఏడెకరాల చెరకు తోట ప్రమాదవశాత్తు కాలిపోయింది. ఫైరింజన్ సకాలంలో వెళ్లకుంటే దాదాపు వందల ఎకరాలు చెరకు దగ్ధమయ్యేది.

ఖమ్మం మార్కెట్‌కు తరలించడం ఏమిటి?

నేలకొండపల్లి ఫైర్‌స్టేషన్‌ను తాజాగా ఖమ్మం మార్కెట్‌కు తరలించారు. నేలకొండపల్లి, ముదిగొండ మండలాలకు చెందిన దాదాపు 80 గ్రామాల్లో ప్రమాదాల నివారణకు ఉపయోగపడే ఫైర్‌స్టేషన్‌ను ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు కేటాయించడంపై మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు నిర్ణయాన్ని విరమించుకుని ఫైరింజన్, సిబ్బందిని యథాస్థానానికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

అగ్నిమాపక శాఖ అధికారి ఏమన్నారంటే..

అగ్నిమాపక శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు నేలకొండపల్లి ఫైరింజన్‌ను ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికి తరలించామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి జయప్రకాష్ తెలిపారు. ఎంత కాలం, ఏమిటి అనే వివరాలు తమకు తెలియదని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

అధికారుల తీరు సరికాదు



అనేక పోరాటాలు చేసి సాధించుకున్న ఫైర్ స్టేషన్‌ను తరలించటం సరికాదు. రైతులు తీవ్రంగా నష్టపోతున్న సమయంలో అప్పట్లో మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి చొరవతో ఫైర్‌స్టేషన్ మంజూరు చేయించారు. ఇప్పుడు కేంద్రాన్ని ఖమ్మంకు తరలించిన అంశంపై ఉద్యమిస్తాం.

– బొడ్డు బొందయ్య, ఎంపీటీసీ, నేలకొండపల్లి

ప్రత్యక్ష ఆందోళన చేస్తాం



ఖమ్మం తరలించిన నేలకొండపల్లి ఫైరింజన్‌ను వెనక్కి పంపించాలి. లేకుంటే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తాం. నేలకొండపల్లి, ముదిగొండ మండలాల ప్రజలకు అవసరమైన ఫైరింజన్‌ను ఖమ్మం మార్కెట్‌కు పంపించటం సరికాదు. అధికారులు, పాలకులు వెంటనే స్పందించాలి.

– బచ్చలకూరి నాగరాజు, కోరట్లగూడెం

చెరకు సీజన్‌లో ఇబ్బందులు



చెరకు సీజన్ కావటంతో కటింగ్ పూర్తయ్యే వరకు రైతులు ఆందోళనగా ఉంటారు. ప్రమాదవశాత్తు చెరకు పంటలు దగ్ధం కావటం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫైరింజన్ ఉంటే నష్టం తీవ్రత తగ్గేది. ఈ విషయాన్ని గుర్తించి ఫైరింజన్‌ను తిరిగి నేలకొండపల్లికి పంపించాలి.

– ఇంటూరి అశోక్, చెరకు రైతు, మోటాపురం

'కంటివెలుగు'లో అసౌకర్యం కలగొద్దు



కంటిపరీక్షను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జమలారెడ్డి

నేలకొండపల్లి: కంటి వెలుగు కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఎంపీడీఓ కె.జమలారెడ్డి ఆదేశించారు. మండలంలోని చెన్నారం లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. టెంట్ లేక ఆరుబయట ఎండలో నిలబడిన ప్రజలను చూసి వెంటనే టెంట్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. సర్పంచ్ మస్తాన్, కంటి వెలుగు అధికారి రాధాకృష్ణ, పీహెచ్ఎన్ కె.వాణి తదితరులు పాల్గొన్నారు.అనంతరం చెన్నారం, కొరట్లగూడెంలో ఉపాధి పనులను పరిశీలించారు. సర్పంచ్ నెల్లూరి అనురాధ, ఈజీఎస్ ఏపీవో సునీత, ఈసీ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శులు నరేష్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని నర్సింహుల గూడెంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బజ్జూరి రాంరెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో ఎదగాలి



స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్, కరస్పాండెంట్ కృష్ణచైతన్య

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఉన్నతస్థానాలకు చేరుకోవాలని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో స్పోర్ట్‌మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. స్మార్ట్ కిడ్జ్ పాఠశాల విద్యార్థులను అన్ని అంశాలలో తీర్చిదిద్దటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్ విజయకుమారి, పీఈటీ క్రాంతికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్వేత

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు ఇష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోరేపల్లి శ్వేత అన్నారు. సోమవారం నగరంలోని వెలాసిటీ జూనియర్ కళాశాల ఫెస్ట్–2023ని ఎంబీ గార్డెన్స్‌లో నిర్వహించగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాశాల చైర్మన్ శెట్టి లక్ష్మణ్‌రావు, డీన్ యాకుబ్, సిబ్బంది పాల్గొన్నారు.

వామ్మో.. దోమల దండు



రహదారిపై దోమల ఉధృతి..

కూసుమంచి: పాలేరు గ్రామంలో సోమవారం ఉదయం ఒక్కసారిగా లక్షలాది దోమలు స్వైర్యవిహారం చేయడంతో గ్రామస్తులు, వాహనదారులు హడలిపోయారు. రహదారిపై వెళ్తున్న వాహనదారులు దోమలను తప్పించుకొని వాహనాలతో ముందుకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడగా, బాటసారులు దోమల వలయంలో చిక్కుకోవాల్సి వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క సారిగా దోమలదండు రావటంతో ఏం జరుగుతుందోనని గ్రామస్తులు అవాక్కయ్యారు. ఈ దోమలను నివారించాలని గ్రామస్తులు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

విద్యార్థులకు పరీక్షప్యాడ్లు

తిరుమలాయపాలెం: ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఇంపాక్ట్ ఫౌండేషన్ మోటివేషనల్ స్పీకర్ మక్కా రవీందర్, సామినేని శారద అన్నారు. సోమవారం తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ఖమ్మం వారి సహకారంతో మోటివేషన్ క్లాసులు నిర్వహించి పరీక్షప్యాడ్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఎస్టేట్స్ వత్సవాయి రవి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, హమీద్ పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని సాహితి జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఐఎంఏ ఫంక్షన్‌హాలులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈఓ రవిబాబు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చైర్మన్ కామసాని నాగేశ్వరరావు, కార్యదర్శి యరగాని శ్రీనివాసరావు, డైరెక్టర్ కొండె వెంకన్న, నిమ్మకాయల తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి

నేలకొండపల్లి: నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నేలకొండపల్లి ఎస్సై జీ.స్రవంతి కోరారు. మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలో సోమవారం జనజాగృతి కళాజాతాతో సమాజ చైతన్య సదస్సును నిర్వహించారు. వివిధ పరిస్థితులను కళ్లకు కట్టినట్లుగా సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు వివరించారు. కళాకారులు వెంకట్, మోహన్, రాజు, రవీంద్రబాబు, పాషా, ఉమాదేవి, స్వప్న, సిసింద్రీ, ఉపేందర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం



ఖమ్మంమయూరిసెంటర్: ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు



ఖమ్మంరూరల్: ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఆప్త మిత్రులైన ప్రధాని మోదీ కార్పొరేట్ అధిపతి గౌతం అదాని చిన్నాభిన్నం చేశారని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. సోమవారం ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రభుత్వం రంగ బ్యాంకుల్లో ఆదాని తీసుకున్న అప్పులు తక్షణం రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ వైరా రోడ్డులోని ఎస్‌బీఐ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. నెహ్రూనగర్‌లోని పాత సీపీఐ కార్యాలయం నుంచి ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్.కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, బి.జి క్లెమెంట్, సి.హెచ్.సీతామహాలక్ష్మి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

అదాని రుణాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి..

ఖమ్మంరూరల్: అదానికి ఎస్‌బీఐ బ్యాంక్ ద్వారా ఇచ్చిన రుణాలపై కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదలు పైసా అప్పు ఉంటే ఇళ్లను జప్తు చేసి ఇబ్బందులకు గురి చేసే అధికారులు బడా బాబులకు మాత్రం పెద్ద పీట వేస్తుండటం దారుణమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మిడకంటి చిన వెంకటరెడ్డి, ఏ.రాంమ్మూర్తినాయక్, ఉన్నం రంగారావు, బి.రాంకోటి, పి.వీరభద్రం, వి.సురేందర్ పాల్గొన్నారు.

స్టాళ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సమీకృత మార్కెట్ పరిశీలనలో కమిషనర్, మేయర్



సమీకృత మార్కెట్‌లో పరిశీలిస్తున్న కమిషనర్, మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని వీడీవోస్ కాలనీ సమీకృత మార్కెట్‌లో వీధివ్యాపారులు, రైతులకు కేటాయించిన స్టాళ్లలో పరిశుభ్రత పాటించాలని కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి సూచించారు. మేయర్, కమిషనర్ సోమవారం మార్కెట్‌ను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీయడంతో పాటు నిర్వహణపై సూచనలు చేశారు. ఆరు బయట బస్తాలు, బుట్టలు పెట్టి అమ్మకూడదని తెలిపారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి...

గ్రీవెన్స్ సెల్‌లో అందే ఫిర్యాదులను పరిశీలించి వారంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మేయర్ నీరజ అధికారులను ఆదేశించారు. సోమవారం కేఎంసీలో జరిగిన గ్రీవెన్స్‌లో మేయర్, కమిషనర్ ఆదర్శ్ సురభి ఫిర్యాదులు స్వీకరించి అధికారులతో సమీక్షించారు. ఇక పన్నుల వసూళ్లపై ఆర్ఐలు, బిల్ కలెక్టర్లతో సమావేశమైన కమిషనర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా పన్నులు వసూలు చేయాలని, ఉదయం 7 గంటల నుండే పర్యటించాలని సూచించారు. కాగా, పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించిన ఐదుగురు బిల్లు కలెక్టర్లకు కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి, ఆర్‌ఓ శ్రీనివాసరావు, ఆర్ఐలు కె.శ్రీనివాస్, లోకేష్‌కుమార్, ఏఎస్‌ఓ వాసుదేవరావు, టీపీఎస్ సంతోష్, డీఈ నవ్యజ్యోతి, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి చేతల్లో కూడా చూపించాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, పక్కన కమిషనర్ ఆదర్శ్

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి ఏ దేశంలో స్థిరపడినా దేశభక్తిని చాటాల్సిన అవసరముందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి సోమవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో అన్ని రుగ్మతలకు వరకట్నమే మూలమని, దీని కారణంగానే భ్రూణ హత్యలు, అవినీతి ప్రబలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరూ మెరుగైన జీవితం కొనసాగిస్తూనే సంపాదించిన సొమ్ములో కొంతైనా సమాజానికి తిరిగి ఇవ్వాలని సూచించారు. ఈ సదస్సులో మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, న్యాయమూర్తులు డి.రాంప్రసాదరావు, అర్చనకుమారి, సహాయ కమిషనర్ మల్లీశ్వరి, న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల రక్షణకు ఫైరింజన్



చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంట ఉత్పత్తుల రక్షణకు ప్రభుత్వం అగ్నిమాపక యంత్రాన్ని మంజూరు చేసిందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత అన్నారు. మార్కెట్‌కు కేటాయించబడిన ఫైరింజన్‌ను సోమవారం రైతు చేతుల మీదుగా ప్రారంభించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేషం, గ్రేడ్–2 కార్యదర్శి బి.బజార్, పాలకవర్గ సభ్యులు పత్తిపాక రమేష్, చాంబర్ బాధ్యులు మన్నెం కృష్ణ, నల్లమల ఆనంద్, చెరుకూరి సంతోష్ కుమార్, దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, అగ్నిమాపక అధికారి పి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో సన్మానం..

మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేతను మార్కెట్ రిటైర్డ్ ఉద్యోగులు సత్కరించారు. రిటైర్డ్ (పెన్షనర్ల) ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కనపర్తి బాబు, కార్యదర్శి జల్లా వెంకటేశ్వర్లు, ఆమంచి కోటయ్య, విశ్వనాథం, హుస్సేన్, మల్లం అంజనేయులు, వెంకటేశ్వర్లు, సుధాకర్ పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలి

ఖమ్మంసహకారనగర్: ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపాల్ మహమ్మద్ జాకిరిల్లకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మస్తాన్ మాట్లాడుతూ.. అన్ని సబ్జెక్టులలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉదయ్, మోనేష్ , గోపీచంద్ పాల్గొన్నారు.

పదోన్నతులు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్‌ను ఆఫ్‌లైన్ (ప్రత్యక్ష కౌన్సెలింగ్ విధానం)లో నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావా దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం బదిలీలు, పదోన్నతుల అంశాలపై జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు షమీ, నాయకులు సతీష్, రాంబాబు, వి.శ్రీనివాసరావు, నరసింహారావు, నర్సింహులు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఏఐపీకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

తిరుమలాయపాలెం: ఏఐపీకేఎంఎస్ (అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం) పాలేరు డివిజన్ అధ్యక్షుడిగా మండలంలోని దమ్మాయిగూడెంకు చెందిన సోమనపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంకు చెందిన రెంటాల యాదగిరిని ఎన్నుకున్నారు. అలాగే, ఉపాధ్యక్షులుగా వీర్ల వెంకటప్పారావు, సహాయ కార్యదర్శిగా చుంచు వెంకన్న, కోశాధికారిగా యోహాన్‌తో పాటు 15మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

గ్రామకంఠం సర్వేను అడ్డుకున్న రైతులు



అధికారులను అడ్డుకుంటున్న రైతులు

నేలకొండపల్లి: మండలంలోని తిరుమలాపురంలో గ్రామ కంఠం భూమి సర్వేకు వెళ్లిన రెవెన్యూ, సర్వేయర్ అధికారులను స్థానిక రైతులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. గ్రామ కంఠం ఆక్రమణలో ఉన్నట్లు గిరిజన రైతులు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడమే కాక డిప్యూటీ ఇన్‌స్పెక్టర్(సర్వే) లూర్దు, తహసీల్దార్ దారా ప్రసాద్, ఆర్ఐ ఇన్‌స్పెక్టర్ మాధవి తదితరులు సోమవారం వచ్చారు. దీంతో రైతులు అడ్డుకోవడంతో మరో వర్గం వారు వారు ఘర్షణ కు దిగారు. ఇరువర్గాల వారికి అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో వెనుదిరిగారు.

మెడికల్ కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న ఎంపీపీ మంగీలాల్

తిరుమలాయపాలెం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా(బోధకాలు) వ్యాధిగ్రస్తులకు తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేసిన మందుల కిట్లను సోమవారం ఎంపీపీ బోడ మంగీలాల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ రాజేశ్వరి, వైద్యాధికారి రామారావు సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ అంబేడ్కర్, కోఆప్షన్ సభ్యుడు షేక్ సైపుద్దిన్, కొక్కిరేణి సర్పంచ్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై వైఎస్సార్ టీపీ ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: ఎడాపెడా విధిస్తున్న విద్యుత్ కోతలు, ఏసీడీ చార్జీలను నిరసిస్తూ సోమవారం మండలంలోని పల్లెగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సధీర్‌బాబు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన 24 గంటల విద్యుత్ సరఫరా హామీని తుంగలో తొక్కారని ఆరోపించారు. ఫలితంగా పంటలు ఎక్కడికక్కడే ఎండిపోతూ రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయాన రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధైర్యంగా పంటలు పండించుకునేవారని గుర్తించారు. కానీ ప్రస్తుత సీఎం కేసీఆర్ తీరుతో రైతులు అడుగడుగునా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో నాయకులు నంద్యాల రవీందర్‌రెడ్డి, నీలం రమేష్, డాక్టర్ మద్దెల ప్రసాద్‌రావు, ఆలస్యం రవి, కొత్త బాలాజీరావు, రాంబాబునాయక్, ఎస్.కె.మదార్ సాహెబ్, ఎండపల్లి వెంకయ్య, వాలూరి. సత్యనారాయణ, సామినేని రవికుమార్, వాకా వీరారెడ్డి, బత్తిని యాలాద్రి, అన్నాబత్తుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.